ప్రజాశక్తి
సోమవారం 08 జనవరి 2024
5
కర్నూలు



ప్రాణ త్యాగాలకైనా సిద్ధం

- 27వ రోజు సమ్మె శిబిరంలో అంగన్వాడీల ప్రతిజ్ఞ - ఎస్మా జిఒ ప్రతుల కాల్చివేత

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌రెడ్డి ప్రభుత్వ వైఖరికి నిరసనగా అంగన్వాడీలు అమరణ దీక్షలతో ధర్నా చౌక్ వద్ద కూర్చుని 27వ రోజుకు చేరింది. ఆదివారం 24 గంటల దీక్షలను సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప ప్రారంభించారు. పొట్టకూటి కోసం పనిచేస్తున్న అంగన్వాడీలపై దుర్మార్గమైన ఎస్మా చట్టాన్ని జగన్ ప్రభుత్వం ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని, అంగన్వాడీలు ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించాలన్నారు. తమ న్యాయమైన కోర్కెల కోసం ఎంతటి బలిదానాలకైనా వెనుకాడమని అంగన్‌వాడీలు హెచ్చరించారు. ఆమరణ నిరాహార దీక్షలో కూర్చుని తమ ప్రాణాలను ప్రభుత్వం బలి తీసుకున్న సమ్మెను విరమించబోమని దీక్షా శిబిరంలో అంగన్వాడీలు, ఆయాలు ప్రతిజ్ఞ చేశారు. న్యాయం కోసం పోరాడుతుంటే జగన్ ప్రభుత్వం అన్యాయంగా వేధింపులకు గురి చేస్తున్నదని తెలిపారు. గౌస్ దేశాయ్, మునెప్ప మాట్లాడుతూ సిపిఎం అంగన్వాడీల పై ఎస్మా ప్రయోగించి బలప్రయోగం చేసి ఉద్యమాన్ని అణిచి వేయాలనుకుంటే రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఏకమై రాష్ట్ర బంద్‌కు కూడా పిలుపునివ్వబోతున్నామని, అంగన్వాడీలు ధైర్యంగా పోరాడాలన్నారు. ఈనెల 9న జైల్ బరో కార్యక్రమంతో అంగన్వాడీలు తమ సత్తా చూపుతారని హెచ్చరించారు. ఆదివారం దీక్షలకు సర్వ శిక్ష అభియాన్ జిల్లా నాయకురాలు చిట్టెమ్మ మద్దతు ఇస్తూ ప్రసంగించారు. తాము అంగన్వాడీల ప్రేరణతోనే తమ సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నామని ప్రభుత్వం హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయమంటే చాలా మొండిగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. సిపిఐ ఎంఎల్ నాయకులు వెంకటేష్ మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు, నాయకులు ఎం.గోపాల్ ,న్యూ సిటీ నగర కమిటీ ఉపాధ్యక్షులు కర్నూలు ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి మారెళ్ళ విజయ్, న్యూ సిటీ కమిటీ ఉపాధ్యక్షులు ఎస్. మహమ్మద్ రఫీ, కె సుధాకరప్ప, కె.రామకృష్ణ, ఎఐటియుసి నగర కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ నాయకత్వం వహించారు.



ఎస్మా జిఒ ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు



సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్



చెప్పలతో చెంపలు కొట్టుకొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

చెప్పలతో చెంపలు కొట్టుకొని వినూత్న నిరసన

గూడూరు: అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె గూడూరులో సిఐటియు ఆధ్వర్యంలో 27 వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా గూడూరులో అంగన్వాడీ కార్మికులు జగన్ ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించినందుకు తప్పు అయిందని చెప్పులతో చెంపలు కొట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అరుణ,మద్దమ్మ, ఇందుమతి, సిఐటియు డివిజన్ కార్యదర్శి జే మోహన్ లు మాట్లాడారు.

ఎస్మా నోటీసుల్ని దహనం : వెల్దుర్తి: ఎపిఅంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిఒ నంబర్ 2 ఎస్మా నోటీసును తిరస్కరిస్తూ 27వ రోజు సమ్మె కొనసాగింది. కర్నూలు ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల దగ్గర అంగన్వాడీ వర్కర్స్ శిరీష రేణుక ఆధ్వర్యంలో సమ్మె కొనసాగించారు. జీవో నెంబర్2 ఎస్మా నోటీసుల్ని కాల్చి వేశారు.. క్రిష్ణగిరి వెల్దుర్తి ఎపి అంగన్వాడి వర్కర్స్ వరలక్ష్మి,ఆదిలక్ష్మి, కామేశ్వరి, సుజాత, శాంతమ్మ నిరాహార దీక్షలో కూర్చున్నారు. జోష్న, మాణిక్యమ్మ, సాలమ్మ పాల్గొన్నారు.

నాణ్యతకు ప్రాధాన్యత

- నాణ్యతతో పనిచేస్తే పది కాలాలు ఉంటాయి
- మూడు డివిజన్లలో 87 కోట్లతో హై ఇంపాక్ట్ రోడ్డు పనులు
- ప్రజాశక్తితో ఆర్ అండ్ బి ఎస్ఈ ఆర్.నాగరాజు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



"మనుషులు శాశ్వతం కాదు నాణ్యతతో చేసిన పనులు శాశ్వతమని భావించి నేను ఉన్న సమ యంలో నాణ్యతకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి పనులు చేయించేందుకు కృషి చేస్తున్నాను" అని రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ ఆర్.నాగరాజు తెలిపారు. సరుకుల రవాణా, మనుషుల ప్రయాణం సవ్యంగా జరగాలంటే రోడ్లు ప్రధాన పాత్ర పోషిస్తాయని, అందుకే ప్రతి గ్రామానికి కలిపే విధంగా రోడ్లు ఉండాలని తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

2022- 23 ఆర్థిక సంవత్సరానికి కొత్త పనులు ఎన్ని వచ్చాయి?

ఎస్ఈ : కర్నూలు, నంద్యాల ఉభయ జిల్లాల్లో 2022 -23ఆర్థిక సంవత్సరానికి కొత్తగా13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.30 కోట్ల (కర్నూలుకు 9 నంద్యాలకు 4), రూ.50 లక్షలతో 5 బ్లాక్ పబ్లిక్ యూనిట్లు మంజూరయ్యాయి. కర్నూలు, నంద్యాల, ఆదోని డివిజన్లో రూ.87 కోట్ల పనులు ప్రారంభమయ్యాయి.

ఎక్కువ ప్రాధాన్యత ఉన్న రోడ్లకు ఎన్ని నిధులు మంజూరయ్యాయి?

ఎస్ఈ : ఎక్కువ ప్రాధాన్యత ఉన్న రోడ్లు నియోజకవర్గానికి ఐదు చొప్పున 25 ప్యాకేజెస్ కు దాదాపు రూ.70 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులు మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బిలలో ఉంటాయి. ఇందులో ప్రధానంగా పాణ్యానికి మూడు, కోడుమూరు రెండు, నందికొట్కూరు రెండు, మంత్రాలయం మూడు, నంద్యాల రెండు, ఎమ్మిగనూరు ఒకటి, ఆదోని మూడు, శ్రీశైలం ఒకటి, పత్తికొండ మూడు, ఆలూరు ఒకటి, ఆళ్లగడ్డ రెండు, బనగానపల్లె ఒకటి, డోన్ ఒకటి ఉన్నాయి.

భవనాల మరమ్మతులకు ఏమైనా నిధులు వచ్చాయా?

ఎస్ఈ : కర్నూలు కలెక్టరేట్ భవనం మరమ్మతుల కోసం 8 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి పనులు జరుగుతున్నాయి.

కొత్తగా ఏర్పడిన నంద్యాల జిల్లా కలెక్టరేట్ నిర్మాణానికి భవనం ఏమైనా మంజూరయిందా..?

ఎస్ఈ : నంద్యాల కలెక్టరేట్ నిర్మాణం కోసం వ్యవసాయ పరిశోధన కేంద్రానికి సంబంధించిన పది ఎకరాల స్థలం సర్వేలో ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయితే భవన నిర్మాణం చేపడతాం.

పుష్కరాలకు సంబంధించి మిగిలి ఉన్న నిధులతో ఏమైనా రోడ్లు వేస్తున్నారా..?

ఎస్ఈ : రేమట, ఉల్చాల రోడ్లు పూర్తిగా పాడవడంతో పుష్కరాలకు సంబంధించిన మిగిలి ఉన్న నిధులతో రేమటకు రూ.రెండు కోట్లు, ఉల్చాలకు రూ.నాలుగు కోట్ల కేటాయించి పనులు ప్రారంభించాం.

కర్నూలులో వక్కెర బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. నిర్మాణానికి ఏమైనా చర్యలు తీసుకున్నారా..?

ఎస్ఈ : వక్కెరవాగు బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.8 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాం. నిధులు వచ్చిన వెంటనే టెండర్లు పిలుస్తాం. అయితే ప్రస్తుతం తాత్కాలిక మరమ్మత్తుల కింద కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్ 10 లక్షల నిధులతో శిథిలావస్థకు చేరిన వక్కెర వాగుకు మరమ్మతులు చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో చాలా చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులకు చర్యలు ఏమైనా తీసుకున్నారా..?

ఎస్ఈ : గ్రామీణ ప్రాంతాల్లో చాలా చోట్ల రోడ్లు దెబ్బ తిన్న విషయం వాస్తవమే. ప్రస్తుతం కొత్తగా కర్నూలు. నంద్యాల, ఆదోని డివిజన్లలో హై ఇంపాక్ట్ రోడ్డు పనులు రూ.87 కోట్లతో ప్రారంభమయ్యాయి. కొత్తగా కె.నాగలాపురం నుండి సింగవరం రోడ్డు, ఉల్చాల తర్వాత కల్వర్టు దెబ్బతినడంతో తాత్కాలికంగా ఏడు లక్షలతో రోడ్డు వేస్తున్నాం. అలాగే కర్నూలు వై జంక్షన్ నుండి కోడుమూరు పెద్దపాడు బ్రిడ్జి వరకు నాలుగు కిలోమీటర్ల రోడ్డు రూ.13 కోట్లతో వేస్తున్నాం.

పనుల్లో నాణ్యత లేకుంటే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఎస్ఈ : పనుల్లో నాణ్యత లేకుంటే క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ విజయవాడ వారు వచ్చి రోడ్లను పరిశీలిస్తారు. రోడ్లలో నాణ్యత లేకుంటే రిక వరీ పెడతారు. బిల్లులు ఆపేయడం జరుగుతుంది.



అంబేద్కర్ బాటలో జగన్ : వైసిపి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాటలో వైఎస్. జగన్మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, సుధాకర్, మేయర్ బివై.రామయ్య, రీజినల్ కోఆర్డినేటర్ పొన్నం రామసుబ్బారెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా వైసిపి జిల్లా కార్యాలయంలో వారు విలేకరులసమావేశంలో మాట్లాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణను గ్రామస్థాయిలో తీసుకెళ్ళాలి అన్నారు. అంబేద్కర్ ఆశయాలను సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొనసాగిస్తున్నారన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓ న్యాయవాది, రాజకీయవాది అన్నారు. అంటరానితనం నిర్మూలనకు కృషి చేసిన వ్యక్తి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా ప్రతినిధులలతో కలిసి గ్రామ స్థాయిలో అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులు అర్పించాలన్నారు. రాష్ట్రంలో సచివాలయం, వాలెంటరీ వ్యవస్థను తప్పుపట్టిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఎన్నికల వస్తున్న నేపథ్యంలో మాట మార్చి చంద్రబాబు సచివాలయం, వాలెంటరీ వ్యవస్థ కావాలని కోరుతున్నారన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎల్లో మీడియా ద్వారా అనేక బూటకపు హామీలను ప్రకటిస్తున్నారన్నారు. ప్రజలు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనకు మద్దతు ఇస్తున్నారన్నారు. 14 సంవత్సరాలు గా ముఖ్యమంత్రి గా పని చేసిన చంద్రబాబు ప్రజలకు ఏమి చేశారో చెప్పడం లేదన్నారు. వైసిపి నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, సిహెచ్ మద్దయ్య, గ్రంధాలయ చైర్మన్ సుభాష్, కార్పొరేటర్లు, వైసిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, చిత్రంలో మేయర్ బివై రామయ్య తదితరులు

శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- పలువురు వక్తలు - ఘనంగా జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో జెవివి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సంబరాలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బిడి. సుధీర్ రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఎఎస్ఇ కళాశాల ప్రిన్సిపల్ ఆదినారాయణ రెడ్డి, ప్రముఖ అష్టావధాని రచయిత బి.హర్ష , జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా హుస్సేన్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సైన్స్ ను నేటి తరాల బాలబాలికలకు తప్పకుండా ప్రచారం చేయాలన్నారు. ఆలోచన అనే ఒక విత్తనంలో జ్ఞానం అనే మహా వృక్షం దాగి ఉందన్నారు. ప్రతి పనిలోనూ సైన్సు ఇమిడి ఉండాలని ప్రతి అంశాన్ని ప్రశ్నించాలని సూచించారు. గతంలో సైన్సు రంగంలో అనేక ఆవిష్కరణలు చేసిన సైంటిస్టులు తమ జీవితాలను కోల్పోవడంతో పాటు సమాజం నుండి అనేక దాడులను ఎదుర్కొన్నారన్నారు. సైన్సు పరిజ్ఞానం సమాజంలో మరింత పెంపొందించడం కోసం కృషి చేయాలని అన్నారు. జన విజ్ఞాన వేదిక చేపడుతున్న ఈ చెకుముకి సంబరాలు చాలా విశిష్టమైనవని పాల్గొన్న విద్యార్థులు విజేతలు కావడం అసాధారణమైన అంశం అని అన్నారు. 42 పాఠశాలలు చెకుముకి సంబరాల్లో జిల్లా స్థాయికి చేరుకున్నాయి. 21 ప్రభుత్వ పాఠశాల టీమ్‌లు హాజరయ్యారని అన్నారు. అనంతరం ఫలితాలను ప్రకటించారు. జిల్లాస్థాయి చెకుముకిలో ప్రయివేట్ మాంటిస్సోరి విద్యానగర్ పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాల ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ జడ్‌పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి ,విజయ్ కుమార్, రమాదేవి (సమత) జిల్లా కమిటీ నాయకులు ఆజాద్,తారక్, రమేష్ నగర నాయకులు లింగరాజు, తిమోతి, భాస్కర్, జ్ఞానేష్, మంజుల, శ్రీజ, సుమిత్రలు టీచర్స్, రుద్రముని, వరంరాజులు వివిధ పాఠశాలల విద్యార్థులు, యాజమానులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చెకుముకి జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ పేపర్లను విడుదల చేస్తున్న అథితులు, విద్యార్థులు



ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి

కర్నూలు టిడిపి ఇంచార్జి టి జి భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని మౌర్య ఇన్‌లో 52వ వార్డు ఎల్‌బిఎస్ నగర్ వాసులు లక్ష్మీనారాయణ, ఆదినారాయణ బృందం టిడిపిలో చేరారు. అనంతరం టిడిపి నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, తెలుగుయువత పార్లమెంటు అధ్యక్షుడు అబ్బాస్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘం నాయకుడు ఎద్దుపెంట అంజి వైసిపిని వీడి తన అనుచరులతో టిడిపిలో చేరారు. రోజా, ఇందిరాగాంధీ నగర్‌లకు చెందిన పలువురు యువకులు సురేష్, మధు, వంశీతో పాటు పలువురు మహిళలు.. టిడిపి నేత మన్సూర్ ఆలీఖాన్ ఆధ్వర్యంలో చేశారు. వారికి టిజి భరత్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ టిడిపితోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కర్నూలులో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకోవడంతో పాటు ఈ ప్రాంతాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళతానని హామీ ఇచ్చారు.



టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి : గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్ర అభివృద్ధి టిడిపి తోనే సాధ్యమని ఆ పార్టీ పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కల్లూరు అర్బన్ 35వ శాంతి నికేతన్ స్కూల్ లైన్ , భగవాన్ నగర్ కాలనీలలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. జగన్ ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గానికి న్యాయం చేయలేదని, వచ్చే ఎన్నికల్లో టిడిపి సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుంటే నే అన్ని వర్గాలకు అభివృద్ధి సాధ్యమన్నారు. యూనిట్ ఇంచార్జి రవి ప్రకాష్ రెడ్డి, జంగాల సుంకన్న, ఏళ్లప్ప, వార్డ్ నాయకులు శేక్షావలి, రాముడు, నంద్యాల పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, క్లస్టర్ ఇంచార్జిలు యన్వి రామకృష్ణ, మాదేశ్, మహిళ నాయకురాలు రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో క్లాప్ డ్రైవర్ల నిరసన



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు నరసింహులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ క్లాప్ డ్రైవర్ల సమ్మె 22వ రోజున ఆదివారం కార్మికులు ఆటపాట కార్యక్రమంతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఓల్డ్ సిటీ సిఐటియు నగర అధ్యక్షులు డి.అబ్దుల్ దేశాయ్ అధ్యక్షత వహించారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికులు గత 22 రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందిం చడం లేదన్నారు. పెండింగ్ లో ఉన్న12నెలల జీతాలు ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, పని భద్రత, వీక్లీ ఆఫ్‌లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అగ్రిమెంట్ ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేస్తూ మొక్కవోని ధైర్యంతో 22 రోజు లుగా సమ్మె చేస్తూ ఆటపాట కార్యక్రమంతో ఆది వారం నిరసన తెలిపారన్నారు. కర్నూలు నగరంలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి గుట్టలు గుట్టలుగా దర్శన మిస్తుందన్నారు. గాలికి చెత్తంతా డ్రైనేజీ కాలువలో పడి మురిగిపోయి దుర్గంధ వాసనతో దోమలకు నిలయాలుగా మారిందన్నారు. ప్రజల ఆరో గ్యాలను కాపాడాలంటే తక్షణమే క్లాప్ డ్రైవర్ల సమ స్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఓల్డ్ సిటీ ఆటో యూనియన్ నగర నాయకులు కుమార్, క్లాప్ డ్రైవర్ యూనియన్ నాయకులు రఘుశేఖర్, నరేష్, ఇస్మాయిల్ నవీన్, బాబ్జి, పరమేష్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గూడూరు : గూడూరులో సమ్మె 13 రోజుకు చేరింది. మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు శాంతన్న అధ్యక్షతన మున్సిపల్ కార్మికులు మెడకు ఉరి తాళ్లు వేసుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జే,మోహన్ మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు మనోహర్ అమ్మ, పద్మమ్మ, వెంకటేశ్వరమ్మ, లక్ష్మీదేవి, శేఖర్, గోపాల్, గుంతన్న పాల్గొన్నారు.



గూడూరులో ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న కార్మికులు



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

రెడ్లకు అవమానం

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

రెడ్లు ఎన్నో ప్రాణత్యాగలు చేసి మంచి ఉన్నత స్థానాల్లో గొప్పగా రాజకీయంగా చాలా రాష్ట్రాల్లో ఉన్నత పదవుల్లో ఉన్నారని, ఎప్పుడు రెడ్లకు ఇంతటి అవమానం జరగలేదని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు పాత కంట్రోల్ రూమ్ దగ్గర బైరెడ్డి కాంప్లెక్స్ లో విలేకరులతో ఆయన మాట్లాడారు. గత ఆదివారం అనంతపురం నగరంలో ఆర్ట్స్ కళాశాలలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహాన్ని రూ.30 లక్షలతో ఆవిష్కరణ చేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆవిష్కరణను అడ్డుకుని పోలీసులతో అందరిని చెల్లాచెదురు చేసి బ్యానర్లు చించేసి ఆవిష్కరణ చేచేయనీయలేదన్నారు. ఇది రెడ్లకు పెద్ద అవమానమన్నారు. బ్రిటిష్ వారికి ఎదురు నిలిచి పోరాడిన గొప్ప వ్యక్తిని ఈ రోజు అవమానించారని, రెడ్ల సంఘం దీనిని తీవ్రంగా పరిగణించి తదుపరి కార్యాచరణ కోసంఈ నెల10 లేదా11వ తేదీన సమావేశం కానుందన్నారు. రాష్ట్రంలో అసలు రెడ్లకంటే నకిలీరెడ్లు రాజకీయాలను శాషిస్తున్నారని అన్నారు. రాష్ట్రప్రభుత్వం అధికారకంగా విగ్రహ ఆవిష్కరణ చేయాలని, రెడ్లకు క్షమాపణ చెప్పాలన్నారు. లేదంటే నిరసనలు ధర్నాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ రెడ్డి, లోకేశ్వరెడ్డి పాల్గొన్నారు.

9న నారా భువనేశ్వరి రాక

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం కడమకుంట్ల, మీటే తండాకు ఈనెల 9న రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి వస్తున్నట్లు టిడిపి ఇన్‌ఛార్జి కెఇ.శ్యాంబాబు తెలిపారు. చంద్రబాబు నాయుడును అక్రమంగా పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపిన సమయంలో కడమకుంట్ల, మీటే తండాల లో టిడిపి కార్యకర్తలు మనోవేదనకు గురై మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు నారా భువనేశ్వరి వస్తున్నట్లు తెలిపారు. ఆమె వస్తున్న సందర్భంగా ఆదివారం కెఇ. శ్యాం బాబు కడముకుంట్ల, మీటేతాండాలకు వెళ్లి అక్కడి స్థానిక నాయకులతో సమావేశమన్నారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిని వెంకటరాముడు, మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పురుగు మందులు , ఎరువుల డీలర్లకు శిక్షణ

ప్రజాశక్తి- వెల్దుర్తి

జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ (మేనేజ్) సహకారంతో ఆత్మ ద్వారా ఎంపికైన కర్నూలు జిల్లాలలోని 40 మంది ఎరువులు , పురుగు మందుల డీలర్లకు వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామంలో దేశీ శిక్షణ నిర్వహించారు. శిక్షణలో క్షేత్ర సందర్శనలో భాగంగా రామళ్లకోట గ్రామంలోని వేరుశనగ, ఉల్లి , జొన్న పంటలను పరిశీలించి చీడపీడల పై అవగాహన కల్పించారు. రైతులు పురుగుమందులు పిచికారి చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల నుంచి డీలర్లకు అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి ఆవశ్యకతను , చేసే విధానాన్ని డీలర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో డి.జయచంద్ర విశ్రాంత జిడిఎ , కార్యక్రమం సమన్వయకర్త వెల్దుర్తి మండలం వ్యవసాయ అధికారి ఆర్.అక్బర్‌బాష, పి సాంబశివుడు, రైతు భరోసా కేంద్రం ఇంచార్జ్ , , జిల్లాలోని వివిధ మండలాల ఎరువులు , పురుగు మందుల డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వై.నగేష్

10న సిఎం ఆఫీస్ ముట్టడి:డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఈనెల 10న సిఎం కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నగేష్ కోరారు. ఆదివారం కర్నూలు సుందరయ్య భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నగేష్, సహాయ కార్యదర్శి హుస్సేన్, జిల్లా నాయకులు శిరీష మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులకు ఇచ్చిన మాట తప్పారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిఎస్‌సి అభ్యర్థులు అనేకసార్లు నిరసనలు, ప్రదర్శనలు, ధర్నాలు, చేసినప్పటికీ స్పందించకపోవడంతో 3వ తేదీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయం ముట్టడించారన్నారు. అయినా సరే ప్రభుత్వం స్పందించక పోవడంతో ఈనెల 10న ఈ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చు కోవడానికి చలో సిఎం కార్యాలయం ముట్టడిని తప్పనిసరి పరిస్థితుల్లో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ముట్టడిలో ఏం జరిగినా సరే దానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటికైనా సరే 9లోపు మెగా డిఎస్‌సి విడుదల చేయకపోతే 10న రాష్ట్రంలోని 10 లక్షల మంది డిఎస్‌సి అభ్యర్థుల సత్తా ఏంటో జగన్మోహన్ రెడ్డికి రుచిచూపిస్తామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ నాయకులు వీరేష్, నవీన్, కీర్తి పాల్గొన్నారు.



20 వ రోజు కొనసాగిన ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

ప్రజాసంఘాల మద్దతు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చల్ : ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 20 వరోజుకు చేరింది. సిఐటియు జిల్లా నాయకులు ఎం.విజయ్, న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి సోకాజు నోటీసులు, ఎలిమినేషన్‌తో బెదిరింపులకు ప్రభుత్వ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారన్నారు. ఎటువంటి హెచ్చరికలను లెక్కచేయకుండా ఐక్యంగా జెఎసి జిల్లా గౌరవాధ్యక్షులు జె. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్ఎస్ఎ ఉద్యోగులు ఐక్యంగా పోరాటంచేస్తేనే ఫలితం ఉంటుందన్నారు. భవిష్యత్తులో మరింత ధైర్యంతో ఉండాలని, ఐక్యంగా ఉద్యమించాలని ఉద్యోగులకు సూచించారు. జెఎసి నాయకులు జిల్లా అధ్యక్షుడు రాజు, రాజారాం, వీరశేఖర్, రమణ, వెంకట్ రాముడు, చిట్టెమ్మ, కృష్ణవేణి, శివమ్మ, సత్యమ్మ, నిర్మల పాల్గొన్నారు.



టిడిపి మేనిఫెస్టో వివరించిన గుడిసె ఆది కృష్ణమ్మ

టిడిపి పాలన కోసం ఎదురుచూపులు

- గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనతో విసిగిపోయిన ఆంధ్ర ప్రజలు టిడీపీ పాలన కోసం ఎదురు చూస్తున్నారని ఆదోని టీడీపీ మాజీ ఇంచార్జ్ గుడిసె అది కృష్ణమ్మ అన్నారు. ఆదివారం ఆదోని పట్టణంలోని ఆదిత్య నర్సింగ్ హెూమ్, ఎంఐజి ఎక్స్‌టెన్షన్ ఏరియా బాబు షుఉ్యరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ మినీ మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వం వల్ల రాష్ట్రం ఎలా నష్టపోయిందో ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, వడ్డెమన్ గోపాల్, మురళి, ఆదోని పట్టణ ముస్లిం మైనార్టీ నాయకుడు సైనుల్లా అల్తాఫ్ జిలన్, రాఘవరెడ్డి, బాబురావు, నాగేంద్ర, భారత్, వీరేష్, పాల్గొన్నారు.

10న నందవరంకు నారా భువనేశ్వరి

- 'నిజం గెలవాలి' రూట్ మ్యాప్ పరిశీలించిన బివిజె

ప్రజాశక్తి - నందవరం



రూట్ మ్యాప్ పరిశీలిస్తున్న బివి జయ నాగేశ్వర రెడ్డి

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన కుటుంబాలను పరిశీలించేందుకు ఈ నెల 10న 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు నాయకుడు సతీమని నారా భువనేశ్వరి మండలానికి రానున్నారు. ఈ మేరకు పర్యటన రూట్ మ్యాప్‌ను టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వరరెడ్డి ఆదివారం పరిశీలించారు. మండల పరిధిలో ముగతి, మాచాపురం గ్రామాల్లో బాబును అక్రమంగా అరెస్టు చేసినందుకు తట్టు కోలేక మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను నారా భువనేశ్వరి పరామార్శనుంచనున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్, టిడిపి నాయకులు గురు రాజారావు దేశాయ్, మాచాపురం కాసింవలి, ధర్మపురం గోపాల్, బాలరాజు, భార్గవ్, నడిపి పీర్ సబ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురువ సంఘాల పొలిటికల్ జెఎసి కో కన్వీనర్‌గా నిట్రవట్టి బసవరాజు

ప్రజాశక్తి - హాలహర్వి



మాట్లాడుతున్న నాయకులు

కురువ సంఘాల పొలిటికల్ జేఏసీ కో కన్వీనర్‌గా నిట్రవట్టి బసవరాజు ఎన్నికయ్యారు. ఆదివారం కర్నూలు జిల్లా కేంద్రంలో ఉన్న పంచలింగాల నాగరాజు గారి ఫామ్ హౌస్‌లో అమీలియా హాస్పిటల్ ఎండి లక్ష్మీప్రసాద్ సూచనతో పంచ లింగాల నాగరాజు గారి ఆధ్వర్యంలో మదాసి, మదారి కురువ, కురువ సంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దాదాపుగా 14 సంఘాలు ముఖ్య నాయకులు హాజరయ్యారు. అన్ని సంఘాల ఆమోదంతో కుల సంఘాల పొలిటికల్ జేఏసీ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ కన్వీనర్‌గా రవికుమార్ ఎన్నికయ్యారు. అలాగే 14 సంఘాల ముఖ్య నాయకులను ఒక సంఘం తరఫున ఒక్కొక్కరిని కో కన్వీనర్‌గా ఎన్నుకొన్నారు. ఆలూరు తాలూకా ఉపాధ్యక్షుడు బసవరాజును కర్నూలు జిల్లా పొలిటికల్ జేఏసీ కో కన్వీనర్‌గా ఎన్నుకొన్నారు. బసవరాజును ఆలూరు తాలూకా పరిధిలో ఉన్న మండల కమిటీ తరఫున గ్రామ కమిటీ తరఫున ప్రత్యేకమైన ధన్యవాదములు తెలిపారు.

అంగన్వాడీలపై బెదిరింపు ధోరణి

- రాష్ట్ర ప్రభుత్వంపై సిఐటియు, ప్రజా సంఘాల ఆగ్రహం - జిఓ 2 ప్రతులను దహనం చేసిన అంగన్వాడీలు

ప్రజాశక్తి - విలేకరులు

ఆలూరు : ప్రభుత్వం అహంకార ధోరణితో ఎస్మా చట్టాన్ని ఉపయోగిస్తు బెదిరింపులకు పాల్పడుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ తెలిపారు. ఆదివారం ఆలూరులో అంబెడ్కర్ సర్కిల్‌లో ఎస్మా జిఓ- 2 పత్రాలను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా పిఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకొని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కెపి.నారాయణ స్వామి, షాకీర్, క్రిష్ణ, ఏఐటియుసి నాయకులు శివ, సిపిఎం, రైతు సంఘం నాయకులు ఈరన్న,ఆటోయునియన్ నాయకులు తిమ్మప్ప,అంగన్వాడీ యూనియన్ నాయకులు జయశ్రీ,హెూతురప్ప,మైన తదితర నాయకులు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు:** గత 27 రోజులుగా జీతాల పెంపు, గ్రాచుటీ సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్లు చేస్తున్న న్యాయపోరాటాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాలతో అణిచివేయాలని ఆలోచించడం దుర్మార్గమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి. రామాంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం సిఐటియు జిల్లా బృందం, మండల బృందం అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్వాతంత్రానికి పూర్వం నుండి ఎస్మా తదితర చట్టాల ద్వారా పోరాటాలపై, నాయకులపై ప్రయోగించారని, అయినా స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టులు వెనక్కి తగ్గలేదని గుర్తు చేశారు. నరేంద్ర మోడీ రైతులపై నల్ల చట్టాలు ప్రయోగిస్తే పోరాటంలో రైతులు విజయం సాధించారని, నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పవలసి వచ్చిందని గుర్తు చేశారు. డిమాండ్లను పరిష్కరించకుండా సమ్మె చేస్తున్న వారిపై అత్యవసర సర్వీసుల చట్టం పరిధిలోకి అంగన్వాడీ వర్కర్లను చేర్చి జీవో నెంబర్ రెండు



ఆలూరు : ఎస్మా చట్ట కాపీలతో నిరసన చేస్తున్న అంగన్వాడీలు



ఆదోని : నిరసన తెలిపిన అంగన్వాడీలు

విడుదల చేయడానికి తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ దిగివచ్చి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక సోమప్ప సర్కిల్లో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జీవో నెంబర్2 పత్రాలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు పి. గోవిందు, బి. రాముడు, ఏఐటీయూసీ నాయకులు రంగన్న, తిమ్మ గురుడు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు గోవర్ధనమ్మ, నాగలక్ష్మి, కృష్ణవేణి, శైలజ, సునీత, గౌసియా, సుమిత్ర, మేరి, జయమ్మ, బండాలత, పార్వతీ, తులసి, రాగమ్మ, శంషాద్, భాను, డివైఎఫ్ఐ నాయకులు సురేష్, అజిత్ పాల్గొన్నారు. **ఆదోని :** న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం తగదని ఆర్‌సిసి అధ్యక్షులు ఏసి శ్రీకాంత్ రెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి రామాంజనేయులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్ గోపాల్, అధ్యక్షులు రామాంజనేయులు, ఏఐటియుసి నాయకులు వీరేష్, విజయ్ అన్నారు. ఆదోనిలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు వరలక్ష్మి పద్మ జానకి అధ్యక్షతన ఎస్మా జీఓ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వేతనాలు పెంచకుండా జీఓలు తెస్తూ చివరకు ఎస్మా చట్టాన్ని తీసుకున్న రావడం ప్రభుత్వ నిరంకుశత్వానికి



ఎమ్మిగనూరు : సోమప్ప సర్కిల్లో ఎస్మా చట్ట కాపీలను దగ్ధం చేస్తున్న అంగన్వాడీలు

నిదర్శనమని అన్నారు. అంతకుముందు మున్సిపల్ మెయిన్ రోడ్‌లో ప్రదర్శన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సోమక్క, గీత, రేణుక, సోమేశ్వరి, శారదా, గౌసియా, గీతా పాల్గొన్నారు. **కోసిగి :** జిఓ-2 కాపీలను దహనం చేశారు. ముందుగా అంగన్వాడి ఉద్యోగులు దీక్షా శిబిరము నుండి ర్యాలీగా బయలుదేరి వైయస్సార్ సర్కిల్ నందు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు కోసిగి మండల కార్యదర్శి రాముడు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు లుసమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నాగేంద్రలు మాటా ్లడారు. ఈ కార్యక్రమంలో కోసిగి మండల అంగన్వాడి యూనియన్ నాయకులు శైలజ, లత, భీమలింగమ్మ, లలిత, సరోజ,భాగ్యవతి, వనజాక్షి, సంగీతమ్మ, తిక్కమ్మ, అంజనమ్మ,పద్మ, ఈరమ్మ, నాగరత్న, నాగమణి తదితరులు పాల్గొన్నారు. **ఆస్పరి:** స్థానిక బస్టాండు రోడ్డుపై అంగన్వాడీ వర్కర్స్ బైటాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, హనుమంతు, రంగస్వామిలు మాట్లాడారు. అనంతరం జీఓ నెంబర్ 2 రద్దు చేయాలని కాపీలను కాల్చివేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాలు జ్యోతి,ప్రమీల, సరోజా, విశ్వకుమారి, దస్తగిరమ్మ, చిట్టెమ్మ, సరోజమ్మలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్ గోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోనిలోని పంప్‌హౌస్ వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లా డుతూ ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు. అధికారులు, మున్సిపల్ శాఖ మంత్రి చర్చల పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు. ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా జగన్ ముఖ్యమంత్రి ఇచ్చిన వాగ్దానాలు వెంటనే అమలు చేయాల న్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం ఇవ్వాలన్నారు. యూనిఫామ్ ఇవ్వాలని, మాస్టర్ విధానాన్ని అమలు చేయాలని, 101 పద్ధతి కింద వేతనాలు ఇవ్వాలని, పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని, పెరిగిన



ఎమ్మిగనూరు : నడుముకు ఆకుల కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

నిత్యావసర ధరల ప్రకారం వేతనాలు పెంచాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ రిస్ అలవెన్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ గ్రాట్యూటీ చివరి జీవితంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని, పర్మినెంట్ సిబ్బందికి సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఇంజనీరింగ్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో కార్మికులకు ఉన్న హక్కులు కోల్పోయి చివరకు కట్టుబట్టులు కరువయ్యాయని, కార్మికులు వినూత్నంగా మొక్కలు నడుము కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి బి రాముడు, ఏఐటీయూసీ తాలూకా సహాయ కార్యదర్శి జి. రంగన్న, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్లప్ప,శివ వీరేష్, నాగప్ప, అల్లా బకాష్,నాగరాజు, సల్మాన్, తిక్కయ్య రంగస్వామి,కేశన్న, ప్రతాప్, ఆరిఫ్,దేవపుత్ర, తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోనెగండ్ల



వెంకట రాముడు (ఫైల్)

బావిలో గాలం వేసి చేపలు పట్టేందుకని తన కుమారులతో కలిసి వెళ్లిన వ్యక్తి అక్కడ ఫిట్స్ వచ్చి బావిలో పడి మృతి చెందిన ఘటన గోనెగండ్ల మండల పరిధిలోని ఒంటెడుదిన్నె గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు ఒంటెడుదిన్నె గ్రామానికి చెందిన వడ్డే వెంకట రాముడు అలియాస్ గణపతి(40) 9,7 సంవత్సరాల వయసున్న ఇద్దరు కుమారులతో కలిసి ఆదివారం మధ్యాహ్నం గ్రామంలోని మౌలాలి దర్గా ఎదురుగా ఉన్న పాడుబడిన బావిలో గాలం వేసి చేపలు పట్టేందుకు వెళ్ళాడు. బావిలో గాలం వేసి గట్టుపై కూర్చున్న అతనికి అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో గిలగిలా కొట్టుకుని విలవిలలాడుతూ పక్కనే ఉన్న తన కుమారుడిని పట్టుకొని పడిపోయాడు. అయితే అదృష్టవశాత్తు కుమారుడు చెట్ల కొమ్మలను పట్టు కొని వేలాడుతూ ఉండిపోయాడు పూడికతో కూడిన పాత బావి కావడం,బావి లోతుగా ఉండి నీరు అధికంగా ఉండడంతో వెంకటరాముడు పూడికలో ఇరుక్కొని మృతి చెందాడు. గట్టుపై ఉన్న మరో కుమారుడు రోధిస్తుండడంతో పక్కనే దర్గా వద్ద ఉన్న గ్రామస్తులు హుటాహుటిన వచ్చి బావిలో చెట్ల కొమ్మలకు వేలాడుతున్న బాలుని పైకి తీసి రక్షించారు. విషయం తెలిసిన వెంటనే గోనెగండ్ల ఎస్ఐ తిమ్మారెడ్డి ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో మూడు ఇంజన్లతో నీటిని తోడి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి కొక్కాలతో మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుని భార్య పద్మావతి రోధనలతో విషాద ఛాయలు నెలకొన్నాయి. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వి. తిమ్మాపురంకు రూ.6 కోట్ల సంక్షేమం

- ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



వైసిపి జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

వైసిపి ప్రభుత్వ పాలనలో మండల పరిధిలోని వగరూరు తిమ్మాపురం గ్రామానికి మాత్రమే రూ.6 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి, వైసిపి యువ నేత వై ప్రదీప్ రెడ్డి అన్నారు. ఆదివారం తిమ్మాపురం గ్రామంలో వైసిపి జండాను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా గ్రామ పొలిమేరల నుంచి బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. గ్రామానికి చేరుకున్న వారు ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి జండాను ఆవిష్కరించారు. శాలువలతో క్రేన్ ద్వారా గజమాలతో పాటు పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తిమ్మాపురం గ్రామం నుంచి జరిగిన ఎన్నికల్లో మెజారిటీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి ఇంచార్జీ విశ్వనాథ్ రెడ్డి గ్రామ వీరారెడ్డి, వగరూరు సర్పంచ్ లింగారెడ్డి, సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బసలదొడ్డి ఎంపిటిసి మృతి

ప్రజాశక్తి - పెద్దకడబూరు



గవిగట్టు అంజనయ్య (ఫైల్)

మండల పరిధిలోని బసలదొడ్డి ఎంపిటిసి గవిగట్టు అంజనయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల సమాచారంమేరకు ఎంపిటిసి గవిగట్టు అంజనయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ తుది శ్వాస వదిలారు. ఆయన మృతి పట్ల వైసీపీ నాయకులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని



బహుమతులు అందజేసిన శ్రీనివాసులు

క్రీడలు ఆయా ప్రాంతాల క్రీడాకారుల మధ్య స్నేహభావాన్ని పెంపొంది స్తాయని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదోనిలోని ఆర్టీసీ కాలనీ, మాత్మ గాంధీ నగర్‌లో విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించి దేశ ఖ్యాతిని నలుమూల వ్యాపింప చేయాలన్నారు. విజేతగా నిలిచిన ఆర్టీసీ విద్యార్థలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దినేష్, శశిధర్, రాజు, భరత్, గణేష్, పవన్, నాగరాజు, శివ, గౌతం పాల్గొన్నారు.

అసదుద్దీన్ ఓవైసీని కలిసిన ఆదోని నేతలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



అసదుద్దీన్ ఓవైసీతో నాయకులు

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీని హైదరాబాదులో తన స్వగ్రామంలో కలిసి ఆదోని ఎంఐఎం నాయకులు ఉమ్మి యూసఫ్,సెక్రటరీ నూర్,ఫ్లోర్ లీడర్ దిలవర్ హుస్సేన్ ఆదివారం కలిశారు. విలేకరులతో వారు మాట్లాడుతూ 2024 జరగబోయే సర్వత్రిక ఎన్నికలపై చర్చించామన్నారు. ఆదోనిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై జరుగుతున్న దాడులపై వివరించారు. రోబోయే ఎన్నికలపై భవిష్యత్తు కార్యాచరణలపై చర్చించారు. ఆదోని మైనారిటీ ఎదురుకుంటున్న పలు సమస్యల వివరించారు. అందుకు అసోద్దీన్ ఓవైసి ఆదోని జరుగుతున్న విషయాలు అడిగి తెలుసుకొని ఆదోని నియోజకవర్గంపై ప్రత్యేకంగా దృష్టి ఉందన్నారు. ఎన్నికలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

సమస్యల నిలయంగా ఎస్‌సి హాస్టల్ : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలోని ఎస్సీ వసతి గహం సమస్యలకు నిలయంగా మారిందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి బోయ తేజ, డివిజన్ అధ్యక్షులు బెస్త జయ సూర్య, ప్రధాన కార్యదర్శి బల్లెకల్లు సూర్య, ఉపాదక్ష్యులు నూర్, రమేష్, హేమంత్, శరత్ విమర్శించారు. ఆదివారం టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం హాస్టల్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి వసతి, టాయిలెట్స్, మెను ప్రకారంగా ఆహారం, గదుల్లో విద్యుత్ దీపాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పైకప్పు పెచ్చులూడి తలపైపడి గాయాలపాలైన సంఘటనలూ ఉన్నాయన్నారు. సంపు కు చిల్లులు పడి డ్రైనేజ్ నీరు కలుస్తున్నాయన్నారు. వాసన భరించలేక మూడు కిలోమీటర్ల దూరం నడిచి పట్టణానికి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అధికారుల్లో చలనం తీసుకొచ్చేలా దశలవారి ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య ఆదోని నియోజక వర్గ నాయకులు మహేష్, వినోద్, ప్రతాప్, మనోహర్, సీను, మధు, యేళ్ళప్ప పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలి : సిఐటియు

ప్రజాశక్తి-ఆలూరు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామనడం కంటే ముందు ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని ఏపి ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు)జిల్లా అధ్యక్షుడు డి.తిమ్మప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ఆలూరులోని ఆటో డ్రైవర్‌లకు కరపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం సంతోషించదగ్గ విషయమేనని ఆటో కార్మికులకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయంగా ఆటో డ్రైవర్‌కు నెలకు 12వేలు అందించి, జిఓ 21ను రద్దు చేసి, వహనమిత్ర పథకం 20వేలకు పెంచాలన్నారు. పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలు తగ్గించి,50 ఏళ్లు దాటినా ఆటో డ్రైవర్ కు 5వేలు ఫింఛన్ ఇవ్వాలని కోరారు. తదితర డిమాండ్‌ల పరిష్కారాన్నికై సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో ఆటో డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సుంకప్ప,శ్రీనివాసులు,విజయ్,సద్దాం,ఎల్లప్ప,శెట్టి,జానీ,రాముడు ,వెంకీ పాల్గొన్నారు.

ఉప్పర సగరులకు అండగా టిడిపి

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని



సమావేశంలో మాట్లాడిన మీనాక్షి నాయుడు

ఆదోని నియోజకవర్గంలో ఉప్పర సగరులకు టీడీపీ అండగా ఉంటుందని ఆదోని నియోజకవర్గం ఇంచార్జ్ మీనాక్షి నాయుడు అన్నారు. ఆదివారం ఆదోనిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా సగర సాధికార కన్వీనర్ గోనబావి గోపాల్ అధ్యక్షతన బీసీల భరోసా బాట కార్యక్రమం నిర్వహించారు. ఆదోని నియోజకవర్గం ఇంచార్జ్ మీనాక్షి నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుతోనే బీసీల అభివృద్ధి జరుగుంతన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో బీసీలు అన్ని రకాలుగా అణిచివేతకు గురికాబడ్డారని విమర్శించారు. అంతకుముందు గోనబావి గోపాల్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో వ్యవస్థలన్నీ సర్వనాశనమయ్యాయని, బీసీల మనుగడ ప్రశ్నార్ధకంగా మారిందన్నారు. కేవలం జగన్ దోచుకోవడం, దాచుకోవడం తప్ప వేరే ఆలోచనే లేకుండా ఈ రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీసగర సాధికార సోషల్ మీడియా కోఆర్డినేటర్ గజ్జలు గణేష్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సగరసాధికారిక మెంబర్ ఉప్పర రవికుమార్, కోడుమూరు మల్లికార్జున, ఆదోని దస్తగిరి, వెంకటేష్, ఆలూరు శేషాద్రి, పత్తికొండ బాలప్ప, ఉప్పర(నగర) పెద్దలు యు అల్లప్ప, లోకన్న, మల్లికార్జున, మన్మధ ఇంజనీర్ నాగేంద్రప్ప, గురు స్వామి, క్రాంతి నగర్ ఈరన్న, నాయకులు పాల్గొన్నారు.

బీసీ నాగరాజును విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడిగా తొలగింపు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

జాతీయ కమిటీ ఆదేశాల మేరకు వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షునిగా బి.సి నాగరాజును తొలగించినట్లు రాష్ట్ర కోర్ కమిటీ నిర్ణయం తీసుకుందని తీసుకున్నట్లు విహెచ్‌పిఎస్ నాయకులు జిల్లా నాయకులు పార్లపల్లి రామాంజనేయులు, మండల అధ్యక్షుడు గుడికల్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ బీసీ నాగరాజు కమిటీ ఆదేశాలకు వ్యతిరేకంగా మీటింగ్ ఏర్పాటు చేసుకోవడం తన సొంత ప్రయోజనాలను ఉపయోగం కోసం ఉపయోగించుకోవడం వలన ఆయనను తొలగించినట్లు తెలిపారు. కావున జిల్లాలో జిల్లా కమిటీ అందరూ గమనించగలరని సూచించారు.

దోమ తెరలు ఉపయోగించాలి : సర్పంచి

ప్రజాశక్తి - చిప్పగిరి

సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ఈరోజులలో ప్రతి ఒక్కరూ దోమకాటుకు గురికాకుండా రక్షణ వలయముగా తప్పనిసరిగా దోమతెరలు వాడాలని సర్పంచ్ ప్రేమ్ కుమార్, చిప్పగిరి ప్రభుత్వ వైద్యాధికారి పార్వతమ్మ, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు హెల్త్ సూపర్వైజర్ రామ్మోహన్ ఆదివారం నేమకల్లు గ్రామంలో సచివాలయ ఏఎన్ఎం సువర్ణమ్మ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎం హెచ్ ఎల్ పి రెడ్డి శేఖర్ ఆశాలు రాధమ్మ, కవిత, ఈరమ్మ పాల్గొన్నారు.

మార్కెట్ ధరకే కందులు కొనుగోలు : ఎఓ

ప్రజాశక్తి - చిప్పగిరి



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బహిరంగ మార్కెట్‌లలో నిర్ణయించిన ధరలకే కందులను నాఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వ్యవసాయ శాఖ అధికారి జయలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులు కందులు విక్రయించుకోవచ్చు అన్నారు. ధాన్యం అమ్మే సమయంలో రైతు యొక్క ఆధార్ కార్డు బ్యాంకు పాస్ పుస్తకం తప్పనిసరిగా ఉండాలన్నారు. ధాన్యం పట్టిన వారం రోజుల లోపల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ అవుతుందన్నారు. గోనె సంచులు, రవాణా చార్జీలు కూడా ఉచితమన్నారు. ఈ అవకాశాన్ని కందులు వేసుకున్న ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఈఓ రమాదేవి, అగ్రికల్చర్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

'దేవుని ఆవుల నుండి పంటలను కాపాడండి'

ప్రజాశక్తి - దేవనకొండ

మండల కేంద్రమైన దేవనకొండలో వెంకటేశ్వర, చెన్నకేశవ, ఆంజనేయ తదితర ఆలయాలకు చెందిన ఆవులు ఉదయం, రాత్రి వేళల్లో పొలాలపై పడి మేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని పంటలు దెబ్బతినకుండా కాపాడాలని రైతులు చిన్న నరసప్ప, రమేష్ ,రఘు, శేఖర్, రంగస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రైతులు మాట్లాడుతూ రబీ సీజన్లో వ్యవసాయ బోర్లు, హంద్రీనీవా కాలువల కింద వేరుశనగ, చోలకాయ, టమోటా తదితర పంటలు సాగు చేశామని అయితే గ్రామ శివారులో ఉన్న పంట పొలాలపై పడి మేస్తుండడంతో పంటల దిగుబడులు దెబ్బతిని నష్టపోతున్నామని తెలిపారు. బాధిత రైతులు స్థానిక ఎస్సై భూ పాలుడుకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వానికి ఆసుపత్రి సమస్యలు పట్టవా

ఆర్‌సిసి వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



మాట్లాడుతున్న ఆర్‌సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి

పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని ఆర్సిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రముఖ పారిశ్రామికవేత్త ఏసీ శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు తగిన మౌలిక సదుపాయాలు లేవని, తాగునీరు, భోజనశాల వసతి లేకపోవడాన్ని ఆయన ఖండించారు. ఆయన మాట్లాడుతూ రాత్రివేళ దోమలు వీరంగం సృష్టిస్తున్నాయని రోగులు వాపోతున్నారన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఆపరేషన్ థియేటర్ నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఈ విషయములో ఆసుపత్రి సేఫ్టీ కమిటీ నిమ్మకునిరెత్తినట్టు ఉందన్నారు. ఈ వ్యవహారంపై ఈ ప్రభుత్వ ఆదోని సబ్ కలెక్టర్,ఆరోగ్యశాఖ మంత్రి, ముఖ్యమంత్రి తక్షణమే చర్య తీసుకొని ప్రజలకు మెరుగైన వైద్యంతో పాటు రోగులకు నాణ్యమైన పోష్టిక ఆహారాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరు మాసాలుగా ఆపరేషన్ జరగడం లేదని సామాన్య ప్రజలు కర్నూలు వెళ్లడానికి ఇబ్బంది పడతారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్సిసి సభ్యులు మంజునాథ్,ఇస్వి షేక్షావలి,జగదీష్,షేక్ పాల్గొన్నారు.



'ఎస్మా'కు నిప్పు

- జీవో నెంబర్ 2 నకలు కాపీలు దహనం
- 27వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె
- నంద్యాలలో రిలే దీక్షలకు కాంగ్రెస్ సంఘీభావం

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె 27వ రోజు ఆదివారం కొనసాగింది. నంద్యాల జిల్లా కేంద్రంలో సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు చేపట్టిన 24 గంటల రిలే నిరాహార దీక్షలను కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆత్మకూరులో ఒంటికాలిపై నిలబడి దండం పెడుతూ నిరసన తెలిపారు. చాగలమర్రిలో బిసి సంఘం నాయకులు మద్దతు తెలిపారు. బండి ఆత్మకూరులో గాంధీ విగ్రహానికి వినతి అందజేశారు. బేతంచెర్లలో పచ్చిగడ్డి తింటూ నిరసన తెలిపారు. రుద్రవరం, కొత్తపల్లి, గోస్పాడు, పాణ్యం తదితర ప్రాంతాల్లో జీవో 2 నకలు కాపీలను మంటల్లో కాల్చివేసి నిరసన తెలిపారు.

నంద్యాల కలెక్టరేట్ : అంగన్వాడీల 24 గంటల రిలే నిరాహార దీక్షలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. దీక్షలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు ప్రారంభించి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించమంటే అంగన్వాడీలను అత్యవసర సేవల్లో చేర్చి వారిపై ఎస్మా ప్రయోగించడం ప్రభుత్వ అవివేకానికి నిదర్శనమన్నారు. అనంతరం అంగన్వాడీల దీక్షలకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, జిల్లా ఉపాధ్యక్షులు శివరామిరెడ్డిలు సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ దీక్షలు చేపట్టినా ముఖ్యమంత్రి, ఆయన మంత్రివర్గం స్పందించకపోవడం బాధాకరమన్నారు. అంగన్వాడీలకు నెలకు రూ. 26 వేలు జీతాలు ఇవ్వాలని, అలవెన్స్ పెంచాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా కలెక్టర్, అధికారులు అంగన్‌వాడీల దీక్షలను సందర్శించిన పాపానా పోలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపిన వారిలో ప్రముఖ సీనియర్ న్యాయవాది శ్రీనివాస మూర్తి, కాంగ్రెస్ నాయకులు ఆనంద్ రావు, సలాం, మైనారిటీ నాయకులు హమ్మద్, కానాల జానీ తదితరులు **మిగతా 6వ పేజీలో...**



పాణ్యంలో జీవో 2 కాపీలను దగ్ధం చేస్తున్న అంగన్వాడీలు, నాయకులు



నంద్యాలలో అంగన్‌వాడీల దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

- కార్మిక చట్టాలు పక్కాగా అమలుకు చర్యలు
- నిర్మాణ రంగం నుండి సెస్సు వసూలు..
- ప్రజాశక్తితో కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎన్.బషీరున్నిసా బేగం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, రెగ్యులర్‌గా ఈ వ్యవస్థను నిర్మూలించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎన్.బషీరున్నిసా బేగం తెలిపారు. అలాగే 2021 ఆగష్టు 28 నుండి 2022 మార్చి 31 మధ్యలో ఈ శ్రమ్‌లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వాళ్లు ప్రమాదవశాత్తు మరణించిన వాళ్లకు రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు అంగ వైకల్యం పొందిన వారిరి లక్ష రూపాయలు వస్తుందన్నారు. ఈ శ్రమ్‌లో నమోదై ఒకవేళ పిఎంఎస్‌బివై కింద లబ్ధి పొంది ఉంటే అలాంటి వారికి ఎక్స్ గ్రేషియా రాదన్నారు. జిల్లాలో కార్మిక చట్టాలు అమలు, బాల కార్మికులు నిర్మూలన తదితర అంశాలపైన ఆమెతో ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో వివరించారు...

ఈ శ్రమ్ నమోదు జరుగుతోందా?

ఎసిఎల్ : ఈ శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల నమోదు మొబైలైజేషన్ జరుగుతున్నాయి. భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ జరుగుతుంది.

కార్మిక శాఖ ఎన్ని విధాలుగా పని చేస్తుంది?

ఎసిఎల్ : కార్మిక శాఖ రెండు విధాలుగా పని చేస్తుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఒక వైపు, కార్మిక సంక్షేమం పేరుతో మరో వైపు పని చేస్తుంది..

ఎన్‌ఫోర్స్‌మెంట్ కింద ఏమి అమలు చేస్తారు?

ఎసిఎల్ : ఎన్ ఫోర్స్ మెంట్ కింద అనేక రకాల చట్టాలు అమలు చేయడం జరుగుతుంది. షాప్స్ చట్టాలు, బిఓసి చట్టం, డిడిఎల్ఆర్ చట్టం, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్, కనీస వేతన చట్టం, చైల్డ్ లేబర్ యాక్ట్, కౌమార కార్మిక చట్టం వంటి చట్టాలను అమలు చేయడం జరుగుతుంది.

ప్రస్తుతం ఈ చట్టాలు అమలులో ఉన్నాయా?

ఎసిఎల్ : తప్పక అమలు చేస్తున్నాం. జిల్లాలో చట్టాలు ఎక్కడ కూడా ఉల్లంఘన జరగకుండా స్థానికంగా లేబర్ అధికారులు పనిచేస్తున్నారు.

కార్మిక శాఖ లో అసిస్టెంట్ కమిషనర్‌కు జ్యూడిషియల్ పవర్ ఉందా?

ఎసిఎల్ : కార్మిక శాఖ పరిధిలో సమస్యలు పరిష్కారం కోసం అసిస్టెంట్ కమిషనర్‌కు క్వాసి జ్యూడిషియల్ పవర్ ఉంటుంది. ఈ జ్యూడిషియల్ కింద ఎంప్లాయి కాంపన్సేషన్ యాక్ట్‌ను అమలు చేయడం జరుగుతుంది. వర్కర్లు ప్రమాదల్లో చనిపోతే ఎంప్లాయి కాంపన్సేషన్ యాక్ట్ కింద కేసులు జరిపి అవార్డు చేస్తాము. అలాగే పరిశ్రమల లోనూ, పెద్ద పెద్ద కంపెనీళ్లలోను వర్కర్లకు గ్రాట్యూటీ ఇవ్వకుంటే పేమెంట్ ఆఫ్ గ్రాట్యూటీ యాక్ట్ ద్వారా కేసులు నమోదు చేసి గ్రాట్యూటీ ఇప్పించడం జరుగుతుంది. కార్మికులకు యజమానుల మధ్య సమస్యలు తలెత్తితే ఇండస్ట్రియల్ యాక్ట్ కింద చర్చలు జరిపి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది.

జిల్లాలో మీ శాఖ ద్వారా బాల కార్మికుల నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎసిఎల్ : జిల్లాలో బాల కార్మిక నిర్మూలనకు ప్రత్యేక చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుంది. బాల కార్మిక నిరోధక చట్టం కింద ఎఎల్ఓల ద్వారా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాము. చైల్డ్ లేబర్‌ను, అలాంటి వారిని గుర్తించి పనిలో పెట్టుకున్న యాజమాన్యాల పైన, అలాగే వృత్తుల్లో బాల కార్మికులు కనిపిస్తే బాల కార్మిక నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేస్తాము. గుర్తించిన పిల్లలను విద్యాశాఖ ద్వారా బడుల్లో చేర్పిస్తాము.

జిల్లాలో ఎంత మంది బాల కార్మికులను గుర్తించారు?

ఎసిఎల్ : గత సంవత్సరంలో 14 సంవత్సరాల లోపు పిల్లలను 22 మందిని, 18 సంవత్సరాలలోపు వారిని 24 మందిని బాల కార్మికులుగా గుర్తించాము. అలాంటి పిల్లలు బడి బయట ఉండకూడదనే లక్ష్యంతో వారిని విద్యాశాఖ ద్వారా బడుల్లో చేర్పిచాము. అలాగే పనుల్లో పెట్టుకున్న యాజమాన్యలపైన చైల్డ్ లేబర్ యాక్ట్ ద్వారా వారికీ కనీస వేతనం ఇప్పించడంతోపాటు యాజమాన్యలపైన కేసులు నమోదు చేశాము. 46 కేసులు నమోదు కాగా 30 కేసులు లేబర్ కోర్టు ద్వారా డిస్పోజ్ అయ్యాయి. బాల కార్మికుల నిర్మూలన కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాము.

జిల్లాలో ఎంత మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు?

ఎసిఎల్ : జిల్లాలో భవన నిర్మాణ రంగంలో 71,541 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో వీరందరికి గుర్తింపు కార్డులు పంపిణీ చేశాము.

ఈ శ్రమ్‌లో ఎంత మంది పేర్లు నమోదు చేసుకున్నారు?

ఎసిఎల్ : ఈ శ్రమ్ పోర్టల్ లో దాదాపు 2,91,739 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఇంకా చేసుకోని వారు ఉంటే సచివాలయాలలోనూ, కామన్ సర్వీసెస్ సెంటర్‌లలో పేర్లు నమోదు చేసుకోవచ్చు.

భవన నిర్మాణ కార్మిక చట్టం (బిఓసి) సెస్ యాక్ట్ పక్కాగా అమలు అవుతోందా?

ఎసిఎల్ : ప్రతి ప్రైవేట్ కన్స్ట్రక్షన్ కంపెనీలు, ప్రభుత్వ వర్కులలో పనిచేసే కాంట్రాక్టర్లు కార్మిక శాఖకు సెస్ యాక్ట్ కింద కాస్ట్ ఆఫ్ కన్స్ట్రక్షన్‌లో ఒక శాతం అమౌంట్ కట్టాలి. అలా కట్టని వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.



సర్వమత ప్రార్ధనలు చేస్తూ నిరసన

- 14వ రోజు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సమ్మెలో భాగంగా 14వ రోజు ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సర్వమత ప్రార్ధనలు చేసి నిరసన తెలిపారు. సిఎం జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చేలా మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కే.మహమ్మద్ గౌస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి భాస్కరాచారిలు మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000, సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు, జీవో నెంబర్ 7 ప్రకారం స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు అర్హులైన కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని డిమాండ్ల సాధనకు కార్మికులంతా మరింత ఐకమత్యంగా పోరాటాలను ఉధృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదాము, రామాంజనేయులు, నాగేశ్వరరావు, మురళి, సిద్దయ్య, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించేలా సిఎంకు బుద్ధి ప్రసాదించాలని ప్రార్ధన చేస్తూ నిరసన తెలిపారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు గొడుగు రాజు, జోసెఫ్, మున్సిపల్ కార్మికులు తిమయ్య, నాగన్న, మోహన్, సురేష్, దానమయ్య, రవి, రూతమ్మ, జీవరత్నమ్మ, మణెమ్మ, సుగుణమ్మ, కుమారి, సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేయడం సరైంది కాదని సిపిఎం పట్టణ కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె 13వ రోజు చేరుకున్న సందర్భంగా సిమెంట్ నగర్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు వన్నూరు భాష తమ సభ్యులతో సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రంగడు, కమలమ్మ,రామసుబ్బయ్య, మద్దయ్య, రామాంజనేయులు సుధాకర్, నాగన్న, ప్రేమ్ కుమార్, మహేశ్వరి, ఇంద్రమ్మ, పద్మ, కమలమ్మ, రామసుబ్బమ్మ, వెంకటలక్ష్మి, మద్దమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సర్వమత ప్రార్ధనలు చేస్తూ మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. వ్యకాసం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, యూనియన్ అధ్యక్ష కార్యదర్శిలు నాగేశ్వరరావు, భాస్కర్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



నంద్యాలలో సర్వమత ప్రార్ధనలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు



ఆత్మకూరులో...



ర్యాలీని ప్రారంభిస్తున్న సర్పంచ్ సావిత్రమ్మ

శాకాహారంతో ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి - పాములపాడు

ప్రతి మనిషి శాఖాహార భోజనం తీసుకున్నట్లయితే ఎంతో ఆరోగ్యంగా ఉంటారని కర్నూల్ పిరమిడ్ మాస్టర్ సంజయ్, నందికొట్కూరు పిరమిడ్ మాస్టర్ శివరాజ్‌లు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని జూటూరు గ్రామంలో శాఖాహారంపై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని గ్రామ సర్పంచి నాయిని సావిత్రమ్మ జెండా ఊపి ప్రారంభించారు. గ్రామమంతా వీధుల గుండా శాఖాహార ఆహారాన్ని తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శాకాహారం భోజనం తీసుకోవడం వలన వివిధ రోగాలకు దూరంగా ఉండి మంచి ఆరోగ్యాన్ని పొందగలుగుతారన్నారు. ప్రతి మనిషి ధ్యానం అలవాటు చేసుకుంటే ఎంతో మంచిదన్నారు. ప్రాణం పోసే అధికారం లేనప్పుడు ప్రాణం తీసే అధికారం కూడా లేదన్నారు. శాఖాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి నాయిని సావిత్రమ్మ, మాస్టర్ శ్రీనివాసా ఆచారి, వైసిపి మండల కార్యదర్శి నాయిని మధుసూదన్ రావు, రామానంద స్వామి, అంకయ్య స్వామి, మాధవి, గ్రామ నాయకులు ఉపేంద్ర, మనోహర్, రమేష్, ఆచారి జనార్ధన్, చరణ్, శ్రీనివాసులు, బాలాజీ, వెంకటేశ్వర్లు, పిరమిడ్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో పోటెత్తిన భక్తజనం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో ఆదివారం భక్తుల సంఖ్య పెరిగింది. భక్తులతో శ్రీశైలం వీధులన్నీ కిటకిటలాడాయి. చలి తీవ్రత పెరిగినప్పటికీ లెక్కచేయకుండా తెల్లవారుజామున మూడు గంటల నుండి పాతాళ గంగలో స్నానాలాచరించి స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లో వేచి ఉన్నారు. స్పర్శ దర్శనం, ఆర్జిత సేవలు, అభిషేకాలు నిలిపివేయడం వలన భక్తులు శీఘ్ర, అతి శీఘ్ర, ఉచిత క్యూలైన్లలో వేచి ఉండి స్వామి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు మూడు నుండి నాలుగు గంటల సమయం పడుతుందని భక్తులు తెలిపారు. క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులకు ఉచితంగా మంచినీరు అల్పాహారం బిస్కెట్లు అందజేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పరిపాలన భవనంలో పనిచేసే సిబ్బంది కూడా ప్రత్యేక డ్యూటీలు కేటాయించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు నిరంతరం క్షేత్ర పరిధిలో పర్యవేక్షిస్తూ ఉన్నారు.

ఆరు నెలలుగా అందని జీతాలు

- ఇబ్బందుల్లో అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల మహిళా సెక్యూరిటీ గార్డులు

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాల మండలంలోని లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులు ఆరు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురుకుల పాఠశాలల భద్రతకు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కోసం ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థ ద్వారా ప్రభుత్వం సెక్యూరిటీ గార్డులను నియమించింది. అయితే సెక్యూరిటీ గార్డ్స్ జీతాలు రాక కుటుంబ పోషణ భారమై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. 2019లో తాడేపల్లిలో ఉన్న సేవ సుప్రీం సెక్యూరిటీ సర్వీస్ సంస్థ కింద గురుకుల పాఠశాలలో ఆరుగురు మహిళలు సెక్యూరిటీ గార్డ్స్‌గా నియమితులయ్యారు. చాలీచాలని వేతనాలతో పాఠశాల, విద్యార్థినిల భద్రతలో విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే గత ఆరు నెలల నుంచి జీతాలు రాక మహిళా సెక్యూరిటీ గార్డ్స్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళా సెక్యూరిటీ గార్డ్స్ కనీస వేతనం కింద రూ. 14 వేలు ఇవ్వాల్సి ఉండగా సేవ సుప్రీం సెక్యూరిటీ సర్వీస్ సంస్థ కేవలం నెలకు రూ.8 వేలు మాత్రమే ఇస్తున్నారని మహిళా సెక్యూరిటీ గార్డ్స్ వాపోతున్నారు. ఇచ్చే రూ.8 వేల వేతనం కూడా సక్రమంగా ఇవ్వకపోవడం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు నెలల నుంచి వేతనాలు లేక కుటుంబ పోషణ భారమై అప్పు చేసి కుటుంబాన్ని పోషించాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళా సెక్యూరిటీ గార్డ్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.



గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా సెక్యూరిటీ గార్డ్స్

వైసిపిలో చేరిన యువకులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని హాజీ నగర్ యువకులు ఆదివారం వైసిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబర్ ఉస్మాన్ భేగ్, టౌన్ యూత్ వింగ్ ప్రెసిడెంట్ లడ్డూ ఆధ్వర్యంలో వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి పట్టణంలోని మార్కెట్ యార్డులో హాజీ నగర్ యువకులకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ పార్టీలో యువకులు సయ్యద్ చాంద్ పాషా, సయ్యద్ రుస్తుం అలీ, సయ్యద్ కాజిమ్ భాష, అబ్దుల్లా బిన్, సిద్దు, అబ్దుల్ హఫీజ్, హైదర్, ఓవైసీ, షేక్ రియాజ్, సలాం, హుమయున్, గౌస్, అక్బర్ వలి, సాగర్, మన్సూర్ చేరారు.



19న అంబేద్కర్ విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవం

- కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
- వైసిపి జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 19న విజయవాడలో జరిగే అంబేద్కర్ విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్టీ నేతలు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి కోరారు. ఆదివారం నంద్యాలలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషాలు మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ నెల 19వ తేది విజయవాడలో అంబేద్కర్ వారసత్వాన్ని పురస్కరించుకొని 404 కోట్ల రూపాయలతో అంబేద్కర్ విగ్రహావిష్కరణ, స్మృతివనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఈనెల 7 నుండి 12వ తేది నుండి నియోజకవర్గం స్థాయి నుండి సచివాలయం పరిధిలో సమావేశాలు నిర్వహించి, ఆ ప్రాంతంలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మైనార్టీ నాయకుడు బాబులాల్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు యువస్ బాషా, జిల్లా ఎస్సీ అధ్యక్షుడు వెంకట రమణ, ఆళ్లగడ్డ అబ్జర్వర్ నరసింహారెడ్డి, బిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ శివశంకర్, మైనార్టీ నాయకులు బాబుల్లా, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ నడిపి సుంకన్న, జిల్లా మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మీడియాపై కాటసాని రాంభూపాల్ రెడ్డి అక్కసు

మనం చేస్తున్న మంచి పనులను ప్రచారం చేసే మీడియా మనకు లేకపోవడం దురదృష్టకరమంటూ ఎమ్మెల్యే కాటసానిరాంభూపాల్ రెడ్డి మీడియాపై అక్కసు కక్కారు. నంద్యాలలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ వర్గాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాక్షి తప్ప మిగతావి మనకు సపోర్ట్ చేయడం లేదని, సోషల్ మీడియాను బాగా ఉపయోగించుకుందామని కార్యకర్తలకు సూచించారు. విలేకరులు యాజమాన్యాలపై ఆధారపడి ఉన్నారని, వారు ఏం చేయలేరని, వారిని నిందించలేమన్నారు. సోషల్ మీడియాను, వాట్సాప్‌లను బాగా ఉపయోగించి పోస్టులు పెట్టాలని వైసిపి నాయకులకు, కార్యకర్తలకు హిత బోధ చేశారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తదితరులు



ఏర్పాట్ల పరిశీలన అనంతరం సొసైటీ కార్యదర్శితో మాట్లాడుతున్న కేంద్ర డిప్యూటీ కార్యదర్శి లలిత్ కుమార్

ముమ్మరంగా 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'కు ఏర్పాట్లు

- కేంద్ర డిప్యూటీ కార్యదర్శి లలిత్ కుమార్

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాలలోని మోడల్ స్కూల్లో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర కార్యక్రమం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని కేంద్ర డిప్యూటీ కార్యదర్శి, అబ్జర్వర్, హెచ్‌ఆర్‌డి లలిత్ కుమార్ తెలిపారు. ఆదివారం పగిడ్యాలలోని మోడల్ స్కూల్లో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర కార్యక్రమ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. నేడు భారత ప్రధాని నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్స్‌లో లైవ్ టెలికాస్ట్ మాట్లాడుతారని చెప్పారు. కేంద్రం అగ్రికల్చర్ ఇన్ఫోసిస్ స్ట్రక్చర్ కింద మండలంలో రైతుల పండించిన పంటను నిలువ చేసుకునేందుకు రూ.3.15 కోట్లతో గోదాములు నిర్మించినట్లు చెప్పారు. ఇలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 17 రకాల పథకాలపై లబ్ధిదారులకు ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఏర్పాట్లపై జిల్లా అధికారులకు, స్థానిక మండల అధికారులకు సూచనలు సలహాలు ఇచ్చారు. పగిడ్యాల సహకార పరపతి సంఘం సొసైటీ కార్యదర్శి ఖాజముద్దీన్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో మాట్లాడే విధానాన్ని ఆయన వివరించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు ఈరన్నకాడడి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో డిపిఒ మంజుల వాణి, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈఓ సుభాన్, తహశీల్దార్ భారతి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో మహిళలు చేరిక

ప్రజాశక్తి - నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణానికి చెందిన పలువురు మహిళలు ఆర్ఎంపి డాక్టర్ మీనాక్షి దేవి, డాక్టర్ నాగశేషులు, ముత్తుజావలి ఆధ్వర్యంలో ఆదివారం నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఆయన కోరారు. పార్టీలో చేరిన వారిలో పట్టణానికి చెందిన మహిళలు సుజాత, ప్రవళిక, ఫాతిమాబీ, ఆశ, రెజీనా, మాలతి, సరోజ, అనిత, అనురాధ, సిద్దయ్య, మధు, మౌలాలి, సుభాన్ వలి, అబ్దుల్ నబీతదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెవివి జిల్లా నాయకులు మాణిక్యం శెట్టి

జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి - నంద్యాల

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ వేదికగా ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంను గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పి.మౌలాలి ప్రారంభిస్తూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథమే లక్ష్యంగా ఈ పోటీ పరీక్షలను జెవివి నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ప్రారంభ సమావేశంలో జెవివి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టి నాగరాజు మాట్లాడుతూ మూఢనమ్మకాలు అత్యంత ప్రమాదకరమైనవని, మదనపల్లె విద్యావంతుల కుటుంబ విషాదంతాన్ని పోటీకి హాజరైన విద్యార్థులకు వివరించారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బి మాణిక్యం శెట్టి ప్రసంగిస్తూ ఈ హైటెక్ యుగంలో కూడా మూఢవిశ్వాసాలకు విద్యావంతులు ప్రాధాన్యం ఇవ్వడం అర్థరహితమన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ సామాజిక అంశాల విశ్లేషణ, శాస్త్రీయ హేతువాద దృక్పథంతో చేసే ఆలోచనని ప్రజానీకంలోకి తీసుకెళ్లే ఆశయంతో పనిచేసే ప్రజాసైన్స్ ఉద్యమ సంస్థ జనవిజ్ఞాన వేదిక అన్నారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా 20 మండలాల నుండి సుమారు 39 పాఠశాలల విద్యార్థుల టీమ్స్ ఈ పోటీ పరీక్షలలో పాల్గొన్నారు. బండి ఆత్మకూర్, పాములపాడు మోడల్ స్కూల్స్, డోన్ పాతపేట జడ్పీహెచ్ఎస్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ప్రైవేటు యజమాన్య పాఠశాలల నుండి శ్రీ సుధా హైస్కూల్ డోన్, గుడ్ సెప్పర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నంద్యాల, శ్రీ లక్ష్మీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నంద్యాల వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను జిల్లాలో సాధించారు. విజేతలకు మెమొంటోలు, బహుమతులు జనవిజ్ఞాన వేదిక ద్వారా అందజేశారు. కార్యక్రమంలో జెవివి నాయకులు సర్వజ్ఞమూర్తి, లతీఫ్, రామరాజు, గోపాల్, చిన్నయ్య, పునీత్, రమణ, కాజా, బాలు, నాగేంద్ర బాబు, యుటిఎఫ్ నాయకులు ప్రసాద్, బాలస్వామి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్ రెడ్డి, జాకీర్ పాల్గొన్నారు.



దాసు అంత్యక్రియల్లో పాల్గొన్న బండి జయరాజు

టిడిపి నాయకుడు దాసు మృతి

- నివాళ్లులర్పించిన బండి జయరాజు, నారపురెడ్డిలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని కొక్కెరంచ గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు తిరుపాటి దాసు (45) అనారోగ్యానికి గురై కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. దాసు భౌతిక కాయాన్ని ఆదివారం ఆయన స్వగ్రామానికి తీసుకొచ్చారు. విషయం తెలిసిన టిడిపి నందికొట్కూరు నియోజకవర్గ మాజీ ఇన్చార్జి బండి జయరాజు, మండల కన్వీనర్ నారపరెడ్డిలు గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు. దాసు తెలుగుదేశం పార్టీలో చురుకైన నాయయకుడని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. దాసు కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం దాసు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు లక్ష్మయ్య, నరసింహులు, స్వాములు రమణారెడ్డి, నాగశేషన్న, ఆచ్చన్నతో పాటు టిడిపి కార్యకర్తలు అభిమానులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో యుటిఎఫ్ క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కటి విద్య అందించాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిరంతరం యుటిఎఫ్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కే సత్య ప్రకాష్, జిల్లా ఆడిట్ కన్వీనర్ యు దస్తగిరి, ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, కే.గోపాల్, ఎస్.సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

'ఎస్మా'కు నిప్పు

5వ పేజీ తరువాయి.. ఉన్నారు. 24 గంటల దీక్షలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నిర్మల, డివిజన్ లోని వివిధ మండలాలకు చెందిన 25 మంది అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు దీక్షల్లో కూర్చున్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **గోస్పాడు మండల కేంద్రంలో** తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సిఐటియు ఆధ్వర్యంలో ఎస్మా జీవో నెంబర్ 2 కాపీలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా నాయకురాలు రమణకుమారి, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు నిర్మలమ్మ మాట్లాడారు. నాయకురాళ్లు భూలక్ష్మి, సువర్ణ రసిత లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** ఎస్మా చట్టాన్ని, జీవో నంబర్ 2ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రుద్రవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు జీవో 2 కాపీలను మంటల్లో వేసి కాల్చి నిరసన తెలిపారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రాజ్యలక్ష్మి, బిబి, లలితమ్మ, రాజకుమారి, నాగలక్ష్మి, తదితరులు మాట్లాడారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. **పాణ్యం :** ఎంపీడీవో ఆఫీస్ దగ్గర జీవో నెంబర్ 2 కాపీలను దగ్ధం చేసి అంగన్‌వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. యూనియన్ నాయకురాలు నాగ సరస్వతి, లక్ష్మీదేవి, సూర్య ప్రభావతి, అనసూయ, హైమావతి, సీఐటీయూ నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** కొత్తపల్లి తాసిల్దార్ కార్యాలయం ఎదుట జీవో 2 కాపీలను అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కాల్చివేసి నిరసన తెలిపారు. జిల్లా నాయకురాలు ఈ హరిత, శ్రీదేవి, వసంత, అంకమ్మ నాగమణి, సామేశ్వరి, జయమ్మ, లక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** అంగన్వాడీల సమస్యలపైన ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని బీసీ సంఘం మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ గౌడ్, గౌరవ అధ్యక్షులు కృష్ణయ్య యాదవ్, నాయకులు డిమాండ్ చేశారు. చాగలమర్రిలోని కేరళ ఆసుపత్రి ఎదురుగా అంబేద్కర్ సర్కిల్లో సిఐటియు నాయకులు పద్మావతి, వసంత, నాగమణి, వై.పద్మావతి, సంజమ్మలు, ఏఐటీయూసీ నాయకులు చంద్రకళా, వహీదా, ఇందుమతిల ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు జీవో 2 కాపీలను దగ్ధం చేశారు. టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి గుత్తి నర్సింహులు, బీసీ సంఘం నాయకులు పీరయ్య,తదితరులు పాల్గొన్నారు. **మిడుతూరు :** మిడుతూరులోని బస్టాండ్ ఆవరణంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఎస్మా జీవో నెంబర్ 2 కాపీలను దగ్ధం చేశారు. అంగన్వాడి వర్కర్స్ మండల నాయకులు డి.సుబ్బమ్మ, సిఐటియు జిల్లా నాయకులు జి.నాగమణి, మండల నాయకులు బి.వెంకట శివుడు, యూనియన్ నాయకులు మారమ్మ, జయమ్మ, రాధిక, శైలజ, నాగమణి, శేషమ్మ, కేజీయ, శారద పాల్గొన్నారు. **పగిడ్యాల :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణం నుండి బస్టాండ్ వరకు అంగన్వాడీలు ర్యాలీగా వెళ్లి ఎస్మా చట్టం కాపీలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, అంగన్వాడి కార్యకర్తలు సాజిదాబి, వరలక్ష్మి, రాములమ్మ, పద్మావతి, ప్రభావతమ్మ, భాస్కరమణి, నారాయణమ్మ, స్వర్ణలత, నాగమణి, హైమావతి పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు వెంకటలక్ష్మి, ప్రమీలమ్మ, సిఐటియు పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, నాయకులు సురేంద్ర యూనియన్ నాయకురాలు విజయలక్ష్మి, లక్ష్మీదేవి, సుజాత, లక్ష్మి, ప్రియాంక, రవణమ్మ, అరుణ పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడులో ఎస్మా జీవో నెంబర్ 2 కాపీలను అంగన్వాడీలు దగ్ధం చేసి నిరసన తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ, నాగమణి, రవణమ్మ బాయ్, శ్రీలత, టీచర్స్,హెల్పర్స్ పాల్గొన్నారు. **బనగానపల్లె :** ప్రభుత్వం అంగన్వాడి వర్కర్లు హెల్పర్లపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా ఉద్యమం ఆగదని సిఐటియు డివిజన్ కార్యదర్శి జెవి సుబ్బయ్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రోజా రమణిలు పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. యూనియన్ సభ్యులు రమాదేవి, వరలక్ష్మి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లపై విడుదల చేసిన ఎస్మా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి షేభారాణి, సిపిఎం పట్టణ కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అంగన్వాడీలు బేతంచెర్ల భారత్ బేకరీ సర్కిల్‌లో సమ్మె శిబిరంలో పచ్చిగడ్డి తింటూ నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీలు పద్మావతి, రామేశ్వరమ్మ, భూలక్ష్మి, సరోజ, రాజేశ్వరి, వెంకటలక్ష్మి అంజలి దేవి రాధమ్మ, లలితమ్మ, కళావతి, మహాలక్ష్మి, సుబ్బలక్ష్మి, ఆనందమ్మ ,నరసమ్మ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం తీవ్ర అన్యాయమని అంగన్వాడి యూనియన్ నాయకులు వెంకటరమణ, ఆనందమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తూ అంగన్వాడీలు తమ నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, రాజు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు జీవో కాపీలను దగ్ధం చేశారు. వ్యకాసం జిల్లా అధ్యక్షుడు యం నాగేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు పి మదర్ బి, ప్రజాసంఘాల నాయకులు ఉస్మాన్ భాష, రామసుబ్బయ్య, సంపంగి వెంకటేశ్వర్లు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు శైలజ, వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, ఉమా దేవి, హరిత తదితరులు పాల్గొన్నారు



ఆత్మకూరులో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు



బేతంచెర్లలో పచ్చిగడ్డి తింటూ నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

ఉద్యమాలతోనే హక్కులు సాధన

- పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి
- 19వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఉద్యమాల ద్వారానే హక్కులను సాధించుకోవాలని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి అన్నారు. నంద్యాలలోని స్థానిక ధర్నా చౌక్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆదివారం 19వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు పిఆర్‌టియు నాయకులు సంఘీభావంగా పాల్గొని మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎప్పుడు రోడ్డెక్కలేదని, ప్రస్తుతం వారి న్యాయమైన హక్కుల కోసం రోడ్డెక్కారని, వారు అడుగుతున్న డిమాండ్లు గతంలో ప్రభుత్వమిచ్చిన హామీలేనని, కాబట్టి ప్రభుత్వ పెద్దలు పరిష్కరించి, సమగ్ర శిక్ష ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. ఈ పోరాటంలో పిఆర్‌టియు ఉద్యోగుల పక్షాన ఉంటుందని, ధైర్యంగా ఉద్యమాన్ని నడపాలని, అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. వారి వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ విజయ రామ, స్టేట్ కౌన్సిలర్ ఖాజా మొహిద్దిన్, హనుమంతు, మండల నాయకులు శ్రీనివాసులు, శ్రీ మౌళి, కరీముల్లా, రాజశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు హిదాయతుల్లా, కాంతారావు, కృష్ణయ్య, పుల్లారెడ్డి, రమాదేవి, సుమలత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ఆత్మకూర్ : సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు పట్టణ అధ్యక్షుడు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వెంటనే ప్రభుత్వం స్పందించి చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు ఇస్మాయిల్, నాగేశ్వరరావు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష ఉద్యోగుల సహాయ నిధికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పిఆర్‌టియు నాయకులు

ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ చంద్రబాబుతోనే : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్ : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భవిష్యత్తుకు గ్యారెంటీ చంద్రబాబు వల్లనే సాధ్యమవుతుందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎరుల పేట వీది, కుబ్రా మసీదు ప్రాంతాలలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్లి నిర్వహించారు. ఈ సందర్భంగా మినీ మేనిఫెస్టో టిడిపి ప్రకటించిన ఆరు పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు నాయుడు తిరిగి అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలను అమలు చేస్తామని, ప్రజలు తప్పనిసరిగా ఈసారి టిడిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవిందరెడ్డి, గిరిరాజు, జెట్టి వేణుగోపాల్, శివప్రసాద్ రెడ్డి, కలీముల్లా, పుల్లారెడ్డి, శీను యాదవ్, షఫీ ఉల్లా, రేడియం నూర్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

నేడు 'జగనన్నకు చెబుదాం-స్పందన'

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమానికి నేడు ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని తెలిపారు.

కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలో రూ. 4 కోట్లతో కర్నూలు రహదారి వెడల్పు కార్యక్రమం, సెంట్రల్ లైటింగ్ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే తన నివాసం నుండి కర్నూలు రహదారి వరకు ర్యాలీగా వెళ్లి భూమి పూజ చేశారు. అనంతరం వెటర్నటి ఆసుపత్రి ఆవరణంలో రూ. 23 లక్షల 94 వేలతో నూతనంగా నిర్మించిన 2వ రైతు భరోసా కేంద్రాన్ని, రాంభూపాల్ నగర్ కాలనీలో రూ. 23 లక్షల 94 వేలతో నిర్మించిన 5వ రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు, ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్డు వెడల్పు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి కళ్లకు పొరలు వచ్చాయని, ఎలాంటి అభివృద్ధి జరగలేదని అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. తాను చేసిన అభివృద్ధి ఎక్కడికైనా చర్చకు సిద్ధమని, దమ్ముంటే చర్చకు రెడీనా అని సవాల్ విసిరారు. 2024 ఎన్నికల్లో మళ్ళీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, తనను శాసనసభ్యునిగా మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని, మిగిలి ఉన్న పనులు అన్నింటినీ పూర్తి చేయడానికి ప్రజల తోడ్పాటు అవసరమని తెలిపారు. కార్యక్రమంలో రోడ్లు భవనంల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, ఏ.ఈ హుస్సేన్, వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి పి ఆర్ ఏఈ మహేష్, వైసిపి అవుకు కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి,షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి రవికుమార్ రెడ్డి, జడ్పిటిసి సుబ్బలక్ష్మమ్మ, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గరుడ దీవెనమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, భానుముక్కల పరపతి సహకార సంఘం చైర్మన్ శ్రీనివాసులు, జిల్లెల్ల శంకర్ రెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి, ఏర్రగుడి సుబ్బారెడ్డి, కిషోర్ కుమార్ సైకిల్ షాప్ మహబూబ్ అలీ, జిటి వెంకటరామిరెడ్డి, జిటి త్రివేణి, గౌండ కంబగిరి, గౌండ నాగరాజు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

మురికి వాడలుగా గ్రామాలు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

వైసిపి ప్రభుత్వంలో రోడ్ల పరిస్థితే అధ్వానంగా ఉంటే వాటి మీద డ్రైనేజీ పారుతూ గ్రామాలను కుప్పతొట్టిలాగా చేశారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంంలోని బెలుం గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే నిర్వహించారు. గ్రామానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యేకు టిడిపి నాయకులు రఘురామిరెడ్డి, బంగి హస్సేనయ్య, జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజల స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక గ్రామాలలో పారిశుధ్యత పూర్తిగా లోపించిందని, ఎక్కడ చూసినా డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులుకు గురి అవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా 6 భవిష్యత్తు గ్యారెంటి పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటపాడు శివరామిరెడ్డి, రఘురామిరెడ్డి, బంగి హస్సేనయ్య అహ్మద్, బి.మహేశ్వర రెడ్డి, రమేష్, జనసేన పార్టీ పృథ్వి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

జిల్లా జూనియర్ హ్యాండ్ బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల పట్టణంలోని గుడ్ షెఫర్డ్ క్రీడా మైదానంలో ఆదివారం నంద్యాల జిల్లా జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీలను ఉపాధ్యాయ సంఘం నాయకుడు ఏపీ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి, ఎంఈఓ రమణారెడ్డి, జాకీర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా పాల్గొనాలన్నారు. ఏదో ఒక క్రీడ ఎంచుకొని తర్ఫీదు చేస్తూ క్రీడల్లో పాల్గొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందాలన్నారు. అనంతరం జిల్లాలోని డోన్, చాగలమర్రి, కొలిమిగుండ్ల, నంద్యాల, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో 30 మంది, బాలుర విభాగంలో 40 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ప్రతినిధులు మహబూబ్ బాషా, రామేశ్వర్ రెడ్డి, రాజకుమార్ రెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ పాఠశాల పిడి బాబు, వ్యామ ఉపాధ్యాయులు భాష, హరి, షేక్షా, దస్తగిరి, వెంకట నరేంద్ర, జానీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కరచాలనం చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకుడు ఏపి రెడ్డి, రాజ్ కుమార్ రెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987-88 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆహ్లాద వాతావరణంలో ఆదివారం జరిగింది. చాలాకాలం తరువాత మిత్రులు ఒకే వేదిక పంచుకోవడంతో భావోద్వేగ వాతావరణం నెలకొంది. నాటి జ్ఞాపకాలు, ముచ్చట్లు చెప్పుకుంటూ పాఠశాల మొత్తం కలియ తిరిగారు. గురువులను సత్కరించి, పాఠశాలకు గేట్ విరాళం ప్రకటించారు.

9న బహిరంగ సభను జయప్రదం చేయండి

- టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్



నంద్యాలలో విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 9న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు 'రా.. కదిలి రా..' బహిరంగ సభలో మేధావులు, విద్యార్థి, యువకులు, రైతు, కార్మికులు, పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ కోరారు. ఆదివారం నంద్యాలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నాలుగేళ్ల వైసీపీ పాలనలో ముస్లింలకు జరిగిన అన్యాయాలు, అవమానాలు అన్నీ ఇన్నీ కావని మండిపడ్డారు. ఇంత దగా, ఇలాంటి అవమానాలు గతంలో జరగలేదని, చంద్రబాబు పాలనలోనే మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. చంద్రబాబు ప్రకటించిన భవిష్యత్‌కు గ్యారెంటీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లటమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. సైకో జగన్‌ను ఓడించి, చంద్రబాబును అధికారంలోకి తెచ్చేందుకు ముస్లీం మైనార్టీలంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నంద్యాల పట్టణ అధ్యక్షులు మానియర్ ఖలీల్, సీనియర్ నాయకులు అబ్దుల్ రషీద్, 35వ వార్డు ఇన్చార్జ్ నూర్ భాషా, 14వ వార్డు ఇన్చార్జ్ సూరజ్, నాయకులు సలీం అన్వర్ తదితరులు పాల్గొన్నారు. **పాణ్యం :** ఈ నెల 9న ఆళ్ళగడ్డలో జరిగే చంద్రబాబు నాయుడు బహిరంగ సభను జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి కోరారు. పాణ్యం మండల టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షులు జయరామి రెడ్డి, రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ బాబు, నాయకులు మనోహర్ ,రామసుబ్బయ్య, బాలసుబ్బయ్య ,మాజీ ఎంపిటిసి రమణ, జాఫర్, మదర్ షా, పెదరాయుడు పాల్గొన్నారు. **ప్యాపిలి :** ఈ నెల 9న ఉమ్మడి కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో జరగబోయే రా.. కదలిరా మహాసభను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వై.నాగేశ్వరరావు కోరారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి డోన్ నియోజకవర్గ ఇన్చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి సహకారంతో జనసమీకరణకు ఆయన నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో రామ్మోహన్ యాదవ్, ప్రసాద్ రెడ్డి, చిన్న సుంకయ్య, సుదర్శన్, కోదండ రామయ్య, కొంగనపల్లి మధు, చల్లావీర, పెద్ద రామాంజి, మల్లికార్జున, బ్యాంకు శీను, అనుదీప్, అక్బర్, ప్రతాప్, శివ కిషోర్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** ఈ నెల 9న ఆళ్లగడ్డలో జరిగే 'రా.. కదలి రా..' బహిరంగ సభ జయప్రదం చేయాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి కోరారు. ఆదివారం పట్టనంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నంద్యాల పార్లమెంట్ స్థాయిలో జరిగే బహిరంగ సభను ఆళ్లగడ్డలో ఏర్పాటు చేశారని, ఆత్మకూర్ ప్రాంతం నుండి 6 వేల మంది కార్యకర్తలు, ప్రజలు తరలి వెళుతున్నట్లు తెలిపారు. సమావేశంలో టిడిపి కళ్యాణదుర్గం ఇంఛార్జి శ్రీ ఉమా మహేశ్వర నాయుడు, శ్రీశైలం నియోజవర్గ నాయకులు మల్లికార్జున, నాయకులు జెట్టి వేణుగోపాల్, కంచర్ల సురేష్ రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు. **రుద్రవరం :**టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆళ్లగడ్డ పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఎస్‌సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు కోరారు. ఆయన మాట్లాడుతూ రుద్రవరంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సహకారంతో మొబలైజేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. నాయుకులు రామచంద్రుడు, చిటికెల సాగర్, అశోక్, జెసిబి దాస్, లూథర్ బాబు, బెనర్జీ, ఆకాష్ తదితరులు పాల్గున్నారు. **ఆళ్లగడ్డ :** రానున్న ఎన్నికల్లో టిడిపి-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, 150 సీట్లతో అధికారం చేపడుతుందని విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, టిడిపి నాయకులు ఏవి సుబ్బారెడ్డి అన్నారు. ఏవి ఫంక్షన్ హాల్ కార్యాలయ ఆవరణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 9న ఆళ్లగడ్డకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా కార్యక్రమంలో భాగంగా బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ సూపర్ సిక్స్ పథకాల గురించి, వైసిపి పాలనలో జరిగే దౌర్జన్యాలను గురించి ప్రజలకు తెలియజేసేందుకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల పార్లమెంట్ పరిధిలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. వైసిపి ప్రభుత్వం రాజకీయాలను క్రీడగా చూస్తోందని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక ప్రజా వేదికను కూల్చడం, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేయించడం, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనిఆరోపించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డ : మాట్లాడుతున్న ఏవి సుబ్బారెడ్డి



రుద్రవరం : మాట్లాడుతున్న కొమ్మలపాటి రాజారావు